# నిదురపోయే సెలయేరు

కొండపల్లి అంత అందంగా ఉంటుందని నాకిదివరకు ఎవరూ చెప్పలేదు. మా జీపు నారింజ తోటల మధ్యనుంచి పాము చారలాంటి రోడ్డు వెంట మెల్లగా పాకుతోంది. ముందు సీట్లో కూర్చొన్న సింగు కుడి భుజం జీపుముందు అద్దంలోంచి కన్పించే రోడ్డు సగం భాగాన్ని కప్పేసింది. లోపలంతా ఉక్కగా ఉంది. రాళ్ళ మధ్య గతుకుల్లో పడి లేస్తూ నడుస్తోంది జీపు. బండి కుదుపు కంటె మనస్సు కుదుపు మరీ బాధపెడ్తోంది నన్ను. ఉండుండి సింగు సిగరెట్టు వెలిగించాడు. లోపలంతా పొగ చుట్టేసి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

మనస్సుకు నచ్చని పని చేయిస్తోన్న సింగుమీద నాకు విపరీతమైన కోపం వస్తోంది. అప్పటికి ఆరునెలలే అయింది నేను సెటిల్మెంటు ఆఫీసులో గుమాస్తాగా చేరి. నేను చేరిన మరి రెండు నెలలకే హైదరాబాదు నుంచి బదిలీ చేయించుకుని ఆఫీసరుగా వచ్చాడు సింగు. మనిషి తరహా అంతా విచిత్రం. ఉద్యోగంలో పెద్దా చిన్నా ఏమీ పాటించ కూడదంటాడు. దండాలు పెట్టడాలూ, చేతులు కట్టుకు నిలబడడాలూ అక్కరలేదని మొదటి రోజే చెప్పేశాడు. అందరూ అతని దగ్గరికి పోవచ్చు. అతను అందరితో కులాసాగా తిరుగుతాడు. అదీ ఇప్పటి పద్ధతి.

ఏభై మంది గిరిజనులకు కొండపల్లి ఖిల్లా ప్రాంతంలో సెటిల్మెంటులు నిర్మించాలంటే నన్నాపనికి నియమించాడు సింగు. అసలే విజయవాడ బ్రతుకుతో విసిగి చస్తున్న నాకు ఇది మరీ కంటకమయింది. ఓ రోజంతా చెప్పుకున్నాను. అంతా విని బిగ్గరగా నవ్వుతాడు. "కొండపల్లి అంటే ఆటబొమ్మలే గుర్తులా ఉంది నీకు – మంచి తోటల్నీ, కావల్సినంత ఆకాశాన్నీ, ఇంకా బోలెడు అందాన్నీ చూపిస్తాను పద" అని వెంటబెట్టుకు బయలుదేరాడు.

విజయవాడ పొలిమేరలు దాటే సరికి సింగు చెప్పిన మాట వాస్తవమేననిపించింది.

"కథలు వ్రాస్తానంటావ్? ఆ మాత్రం పెర్స్పెక్టివ్ లేకపోతే ఎలాగోయ్! – ఈ నారింజతోటలు చూడు–మరి రెండు మైళ్ళు పోతే మామిడి తోపులూ, కొండలూ బ్రహ్మాండంగా కనిపిస్తాయి" అంటూ సిగరెట్టు పొగ వదుల్తున్నాడు సింగు.

ఇరవై ఏళ్ళు ఆంధ్రలోనే గడపడం వల్ల తెలుగు బాగా వచ్చునతనికి. ఇంకా కావలిస్తే కొందరు తెలుగు రచయితల గేయాలు కూడా చదువుతాడు. అయితే సిన్సియర్‌గా ప్రతిమాటా చెప్పాలన్న తాపత్రయంతో మాటలు కృతకంగా వస్తాయి. ప్రతి చిన్న పదాన్నీ పంజాబీలోలాగా పట్టిపట్టి ఉచ్ఛరిస్తాడు–

"ఏం? – మీ కవులకి నారింజతోటలు చాలవూ? ఇక్కడ కవిత్వం చెప్పలేనివాడివి విజయవాడ పందుల మధ్య, బజారు మనుషుల మధ్య ఏం చెప్తావ్? – సెటిల్మెంటు పని పూర్తయేసరికి పెద్ద కావ్యం తయారవాలి. కలెక్టరుగారికి అంకితం ఇప్పిస్తాను."

"నేను కవినికాదు, రచయితని" అని ముందుకి వంగి చెప్పబోతే సిగరెట్టు పొగ నోట్లోకి పోయి దగ్గుతో ఉమ్మతిప్పింది.

నవ్వు ప్రారంభించాడు నా మాట విని – "రచయితవయితే కథరాయి, జీవితంలో ఎందుకూ పనికిరానివాడు రచయిత అవుతాడని మా భాషలో సామెత ఉంది. నీ విషయంలో అది నిజంకాదనుకో – అదిగో, కొండపల్లి ఖిల్లా – ఆపవోయ్ జాన్!" – అరిచాడు డ్రైవరువేపు తిరిగి.

ఫ్లాస్కు భుజానికి తగిలించి జీపు దిగి నడవడం ప్రారంభించాడు. నన్నూ దిగమన్నాడు. జీపుని ఖిల్లాముందుకు తీసుకురమ్మని జాన్‌కు చెప్పాడు.

"మొదట ఇంతకాఫీ పుచ్చుకొందాం–లేకపోతే కడుపు సహాయ నిరాకరణ చేస్తుంది" అన్నాడు– రాయి మీద కూర్చుని ఫ్లాస్కు తీశాడు.

ఖిల్లా దూరంగా కొండవేపు కన్పిస్తోంది. కొండ పాదాలను తాకే నీలపు నీరు, పక్కనే ముదురు ఆకుపచ్చలో ఒత్తుగా పెరిగిన పిచ్చిచెట్లూ, పదిగంటల ఎండకి వెండిలా మెరిసే తెల్లటి మేఘం – తెలీని చిత్రకారుడి త్రివర్ణ చిత్రంలా ఉంది.

"చాలా థాంక్స్, ఇక్కడ కొన్నాళ్ళుంటే నేను తేరుకుంటాను."

"అదిగో అప్పుడే చుట్టూ చూసి మూర్ఛపోతున్నావు. రచయిత తాను ఒళ్ళు మరిచిపోకూడదు. ఇతరులలో ఆభావాన్ని కలిగించాలి. మొదట కాఫీ సేవించు" అన్నాడు.

ఆఫీసరని ఎంత వినయంగా ప్రవర్తించడానికి ప్రయత్నించినా అవకాశం ఇవ్వడు సింగు. అతనిలోని సెన్స్ ఆఫ్ హ్యూమర్ విస్తుపోయేట్టు చేస్తుంది. మాటిమాటికీ – అదే ఆలోచిస్తూ నడుస్తున్నాను.

"హైదరాబాదు చాలా అందమైన ఊరంటారే! నేనెప్పుడూ చూడలేదు అనుకోండి అక్కణ్నుంచి వచ్చేశారేం?"

అది విని సింగు ఒకటే నవ్వు. కాస్సేపటికి ప్రారంభించాడు. "ఎంతో అందమైనవన్నీ ఎందుకూ పనికిరాకుండా పోతాయ్ భయ్యా!— ఉదాహరణకి కలవపువ్వూ, సెలయేరూ – ఇహ, నేనెందుకు వచ్చేశానంటావా? ప్రేమతో గుంజాటన పడడానికి విసుగేసింది. ఒక్క రహస్యం చెప్తాను విను – ఎవరినయినా, ప్రేమించుగాని, .... యువతిని మాత్రం ... పోనీ, ఎందుకు ఆ విషయం" నాభుజం మీద చెయ్యేసి కావాలని కుంటుతూ నడుస్తున్నాడు. నాకతని ప్రతీమాటా వింతగానే తోస్తోంది.

"అయితే మీకూ ప్రేమ...."

భుజం తట్టాడు. "ప్రేమలో ఉండే తమాషాయే అది – దాని గురించి ఆలోచించినంతసేపూ శలిస్తుంది. ఆలోచించే తీరిక చిక్కేలోపల నీకు తెలీకుండానే ముంచేస్తుంది. నన్ను ముంచేయకుండానే హైదరాబాదు ప్రేమ నుంచి విజయవాడ పందుల మధ్య పడ్డాను. పెద్ద కాంట్రాస్టు" – జేబులోంచి నల్లద్దాల కళ్ళజోడు తీసి తగిలించాడు.

ఇద్దరు సబార్డినేట్స్ దారిలో కలిశారు. ఎవరో పాతదేవుడి దేవాలయంతో ఊరు ప్రారంభమయింది. ఊరేం పెద్దదికాదు. వరసగా 50 గడప కనిపించాయి – పక్కకి తిరగగానే మళ్ళీ పెద్ద ఖాళీస్థలం ..... చివర అరటితోట – అక్కడి నీడల్లో కూర్చోవాలన్న ఆసక్తి కలిగించేట్టు –

గ్రౌండ్సు మధ్య మా జీపు కన్పించింది.

"మన జాన్‌కీ అందం పిచ్చి తలకెక్కుతోంది" అన్నాడు సింగ్ జీప్‌ను చూసి.

జాన్ నీలిరంగు పాంటు ఎండలో కళ్లు చెదిరిస్తోంది. మమ్మల్ని చూసి గ్రౌండ్సుకు మధ్యగా పరుగెత్తుకు వచ్చాడు.

"మన క్వార్టర్స్ అటువేపుటసార్. అప్పుడే మీరు ఫర్లాంగుదాటి వచ్చేశారు" అన్నాడు.

మళ్ళీ జీపు ఎక్కాం. ఎత్తుపల్లాల్ని చూడకుండా తీసుకుపోతున్నాడు జాన్. మరో 20 నిమిషాలకి కాస్త విశాలమైన స్థలానికి చేరాం. ఎదురుగ్గా పాఠశాల, ఆ పక్కనే వరసగా పది గుడిసెలు, ఇటుపక్క అన్నిటికంటె కాస్త ఎత్తుగా ఒక పసుపుపచ్చటి మేడ, పక్కన మట్టి ఇళ్లు ఓ ఇరవై – ఇదీ అక్కడ దృశ్యం –

ఎన్నాళ్ళుగానో తెలిసినట్టు పసుపుపచ్చ మేడముందు నిలబడిన ముసలమ్మ నమస్కారం చేస్తోంది –

"ఇదేసార్ – మన క్వార్టర్ –" అన్నాడు జాన్ –

మేడకు ముందు సన్నజాజి పందిరా, రెండు పక్కలా బంతి మొక్కలూ – ఓ పక్క మరీ మూలకి నైట్‌క్వీన్ – చిన్న రైలుపెట్టెలా ఉంది మేడ అంతా.

"ఈ ఊరులో ఈ మేడ సుఖానికి సింబల్‌లాగ ఉంది. నువ్వు చాలా అదృష్టవంతుడివి

– ఖర్చులన్నీ గవర్నమెంటుకి జమ అయ్యేట్టు చూస్తాలే" అంటున్నాడు సింగు.

మేడ బాగానే ఉంది – ముందు తోటలో చిన్న సిమెంటు బెంచీ ఓ పక్క చేరబడటానికి. ఎవరో ముసలి వాళ్లు కూర్చోడానికి వీలుగా ఎత్తు దిమ్మెలూ వేశారు. మెట్లెక్కగానే పెద్ద ఫోటో హాలులో కన్పిస్తోంది. కొండపల్లి బొమ్మల వర్తకం చేసే యజమాని చిత్రపటమది. కొన్నాళ్ళ క్రితం జరిగిన రైలుప్రమాదంలో అతను మరణించాడని తర్వాత అక్కడివాళ్ళు చెప్పారు. ఇంతపెద్ద మేడలో నేనొక్కడినే ఉండాలేమోనన్న బెంగపట్టుకుంది. ఆగలేక సింగుని అడిగేశాను.

"రచయిత అంత పిరికివాళ్ళు మరొకరుండరోయ్ – ఈ పనిమనిషి నీకు తోడు" అన్నాడు.

డెభ్భై దాటిన ముసలి శరీరాన్ని చూసేసరికి జుగుప్స కలిగింది. ముఖమంతా నవ్వు చేసుకుని గోడకు ఆనుకుని నిలబడ్డది ఆమె. వంగిన నడుంని వినయం మరికాస్త వంచింది. నా చికాకుని గమనించి – "పోనీ ఈమె వద్దులే. మంచి అమ్మాయినే ఏర్పాటు చేయిస్తాను" అనేశాడు సింగు.

ముసలామెకు విన్పించదుకూడా కాబోలు, చెవులకి చెయ్యి అడ్డం ఉంచుకొని సగం మాటల్ని అర్థం చేసుకుంది. "ఉద్యోగం తీసేయకండి బాబూ! పది ఏళ్ళ నుంచీ ఈ మేడలో పనిచేస్తున్నాను" అంది. సింగు విన్పించుకోలేదు. మేడమెట్లు ఎక్కుతున్నాడు.

"రేపట్నుంచీ దాని అమ్మాయి వస్తుందిట సార్ పనికి. ఇవాళ కొండవేపు పుల్లలు ఏరుకు రావడానికి వెళ్ళిందట" అన్నాడు జాన్ బాల్కనీలో నిలబడ్డ మా దగ్గరికి వచ్చి.

"నాకేం అభ్యంతరం లేదు. ఏమంటావు?" అన్నట్టు నా వేపు చూశాడు, "ఎవరో ఒకరు రానీయండి" అన్నాను, భుజానికి అయిన సున్నాన్ని దులుపుకుంటూ –

అక్కడికి మేం ఇళ్ళు కట్టించాల్సిన స్థలం మూడు ఫర్లాంగులుంటుంది. మేడమీద నిలబడితే దూరంగా ఎవరిదో మసీదూ, ఆపక్కనే ఖాళీ స్థలం కన్పిస్తుంది, జేగురురంగు ఆకారంలో కొండా – దుబ్బుగా పెరిగిన చెట్లూ –

ముగ్గురు ఉద్యోగుల్ని నాకు అప్పగించేసి ఒక్కరోజు ఉండమన్నా వీలుండదని సాయంకాలమే వెళ్ళిపోయాడు సింగు. ఓ పక్క ఊరు ప్రశాంతత బావున్నా, ఏదో పిరికితనం మనస్సును పీకుతూనే ఉంది. ఆ మేడలో గదులేవీ లేవు – అన్నీ హాలులే. మీద బాల్కనీలో కుర్చీ వేయించుకు రాత్రంతా గడిపాను –

లేచేసరికి ఒళ్ళంతా మంచులో తడిసి ముద్దయింది. కాలు కదపబోతే నరాలు తిరుగుబాటు చేస్తున్నాయి. ఇక్కడ పడుకోవడం మంచిది కాదని ఎవరూ చెప్పలేదు. తీరా ఫలితం అనుభవించాక అక్కడ అందరి మీదా విసుగేసింది.

తెల్లవారుఝామున మంచినీళ్ళకని లేచి వెలిగించిన కొవ్వొత్తి నీరు కారి బల్లనిండా పాకి తెల్లటిచార కట్టింది. దగ్గరికి వచ్చి కత్తితో చారని తొలగించబోతే రెక్క తెగిన పురుగులు

రెండు వచ్చి కన్పించాయి -

కాఫీ తాగాలనిపించింది. తల దిమ్ముగా ఏ పనిచేయడానికీ తోచడం లేదు. అక్కడెవరి పేరూ తెలీదు. జాన్ సింగును తీసుకు విజయవాడ వెళ్లిపోయిఉంటాడని తెలిసికూడా 'జాన్!' అని అరిచాను. హాలంతా ప్రతిధ్వనిస్తోంది. నిజంగానే తలచుట్టూ మఫ్లర్ తిప్పుకొంటూ జాన్ వచ్చే సరికి విస్తుపోయాను.

"వెళ్ళలేదూ విజయవాడకి?"

"వెళ్ళి అరగంట క్రితమే వచ్చేశాను సార్ - టాప్‌స్పీడ్, మీరిక్కడ ఇబ్బంది పడతారేమోనని సింగ్‌గారు తొందరగా పంపేశారు సార్ .... మొహం కడుక్కోండి సార్ - మంచి టీ రెడీ చేయిస్తాను" - హుషారుగా బయటికి పరుగెత్తుతున్నాడు.

"టీ వద్దుకాని - కాఫీ దొరుకుతుందేమో చూడు."

"ఆల్‌రైట్ సార్-" అని గది బైటికి వచ్చి 'పంకజం' అని అరుస్తున్నాడు.

"ఎవరా పంకజం?"

మొహం చాటంత చేసుకొని మళ్ళీ గదిలోకి వచ్చాడు. "నిన్నటి ముసల్ది లేదు సార్?- దాని కూతురు. మా భలే చురుగ్గా పనిచేస్తుంది - కాఫీ పంపిస్తానుండండి" మెట్లన్నీ మూడంగల్లో దిగాడు.

కళ్ళింకా విడడం లేదు. మళ్ళీ పరుపు పరుచుకు పడుకుంటే బావుణ్ను. అయినా కాఫీ తాగితే కాస్త స్థిమితం చిక్కుతుందనే ఆశ ఉండిపోయింది. బ్రష్ పట్టుకుని, తువాలు భుజంమీద వేసుకొని కిందికి దిగబోతే కింద మెట్ల మీద ఏదో పాట గొణుగుతూ తుడుస్తున్నారెవరో -

వంగపువ్వు రంగుకోక, ఎర్రగా బిగుతుగా భుజాల్ని పట్టుకున్న రెవికా, ముక్కు కన్పించకుండా పెద్ద నత్తూ. చేతికున్న వెండి గాజులు శబ్దమయ్యేలాగు చీపురు తిప్పుతూ ఒక్కొక్క మెట్టే ఎక్కుతోంది -

నేను అయిదుమెట్లు దిగేసరికి అప్పుడే పదిమెట్లు ఎక్కేసింది. పొరపాటున బ్రష్ జారి మూడు మెట్లు కింద పడితే, ఒక్కసారి బెదిరి లేచింది. విశాలమైన నుదురు మీద పొడుంరంగుబొట్టూ, మధ్య తళతళమని మెరుస్తూ తెల్లని జిగి, మెడలో ఎర్రటి పూసలు సన్నటి మెడచుట్టూ రక్తం గీతలాగ - ముఖ్యంగా పెదాలు - అంత ఆశ్చర్యంలోనూ కింద పెదవిని నొక్కిపెడితే పెద్ద అరిందాలాగా కన్పించింది. అంతలో భయపడి గోడకి ఆనుకు నిలబడ్డది నాకు తోవచేస్తూ -

మరీ అంత నలుపుకాని ముఖాన్ని చూస్తూ ఆగిపోయాను - మెడమీద రెండు ముడుతలూ శంఖం మీద చారల్లా కన్పించాయి - ఎంతకీ మాట్లాడదు. జాన్ చెప్పిన పేరు గుర్తుంది.

"ఎంత టైమయిందిప్పుడు?"

మాట్లాడదు. అసలు నావేపే చూడడం లేదు. గోడకి అంటుకు నిలబడి నాకు దారి చేసింది. రంగు చీరెతో గోడకి అంటుకుంటే సీతాకోక చిలుక వాలినట్టుంది – నవ్వొచ్చింది, ఇంకా నేనక్కడే నిలబడితే "ఎంత సేపు ఇట్లా?" అన్నట్టు భయంగా చూస్తోంది.

అరగంట గడిచాక నేను మేడమీదికి వస్తే బాల్కనీ గోడకి చేరబడి కూచొని తదేకంగా బయటికి చూస్తోంది. టేబిలు మీద కాఫీ చల్లారి పోయింది. నా కంతా పంకజం మీదే దృష్టి. ఎండవెలుగు స్తంభం మీద పడి పగులుతోంది. అద్దంలో పంకజం నల్లటి ముఖం మీద సూర్యుడి వెలుగు వింతరంగు దిద్దినట్టనిపించింది.

"చల్లారితే కాఫీ మూతపెట్టలేక పోయావ్?"

మాట్లాడదు.

ఆమె వేపు నడవబోతే కాలిలో బలంగా గాజుపెంకు దిగి రక్తం చిమ్మింది. నేలమీద చూస్తే ఏదో ప్రకృతి చిత్రపటం విరిగి ముక్కలయి పడిఉంది.

పంకజం ఇటు తిరిగింది. నాకాలు రక్తం చూసి కూర్చొని పిచ్చిగా ఏడుస్తోంది. నేను దిమ్మరపోయాను.

"నాకు దెబ్బతగిల్తే నువ్వు ఏడుస్తావేమిటి?" అంటే వినదు. స్తంభానికి చేరబడి ఒకటే ఏడుపు.

జాన్ పరుగెత్తుకు వచ్చాడు "ఏమయింది సార్" అంటూ.

"నాకు కాలిలో గాజుపెంకు దిగింది – అదిసరే. ఆ అమ్మాయి అట్లా ఏడుస్తుందేం? ఊరుకోమను"

దగ్గరికి వెళ్ళి సంజ్ఞ చేస్తున్నాడు జాన్, ఏం జరిగిందని.

"మాట్లాడదేం ఎంత అడిగినా?"

నవ్వుతాడు, "దానికి మాటల్రావుట సార్ – నాకూ ఇంతకుముందు తెలీదు, ఇప్పుడే వాళ్ళమ్మ చెప్పింది."

నేను నిర్ఘాంతపోయాను. పంకజం ఇంకా ఏడుస్తూనే ఉంది. రక్తం మీద హిమోగ్లోబిన్ పొర పేరుకుంది.

జాన్ ఆమె దగ్గరగా చతికిలబడ్డాడు – ఏదో సంజ్ఞలు చేస్తోంది. నేలమీద గీతలు గీసింది. మళ్ళీ ఏడుస్తోంది. ఊరుకొమ్మని నోరుమూశాడు జాన్. ఇంకా ఏడుస్తోంది. రెక్క పట్టుకుని బయటకు పంపించేసి వచ్చాడు.

"ఏమయింది?"

"పటాలు తుడుస్తూంటే ఇది కిందపడి పగిలిందట. మీరేమైనా అనుకుంటారేమోనని భయపడి నిలబడి పోయింది. ఇంతలో మీ కాలి దెబ్బ చూసి భయపడి ఏడ్చేసింది – పిరికిమనిషి" నేల మీద కూచుని తడిగుడ్డ తెచ్చి గాజుపెంకుల్ని పోగుచేశాడు జాన్.

"అయితే మాటల్రావా జాన్?"

"సందేహంలేదు సార్! ఏమో – చురుకుమనిషి అనుకున్నాను – బొత్తిగా ధైర్యం లేదండి" ఇంకా నవ్వుతున్నాడు.

కాఫీ తాగిన కాస్సేపటికి మత్తంతా వదిలిపోయింది. నలుగురు ఉద్యోగులూ పదిగంటలకు వచ్చి పనిచూసుకు వెళ్ళిపోయారు. ఇంజనీరు వచ్చి "ప్లాన్లు చూడడానికి వస్తారా?" అన్నాడు.

"లంచ్ తర్వాత వస్తాను. ఆరోగ్యం బాగుండలేదు. ఈలోగా పని ప్రారంభించండి" అన్నాను.

పదెకరాల మేరలో అప్పుడే కూలీలు పనిచేస్తున్నారు నేను వెళ్ళేసరికి. నా అజమాయిషీలో ఉంచిన ఉద్యోగులలో ఒకడైన విఠలరావు ఎన్ని ఇళ్ళు లేచేదీ, ఎక్కడ షెడ్లు లేచేదీ చెప్తున్నాడు. స్థలానికి కుడివేపు పెద్ద సెలయేరు. ఇళ్ళు లేచాక సెలయేటి అందం పెరుగుతుందనిపించింది. ఇప్పుడంతా బోసిపోయినట్టు, సరుగుడు చెట్లగాలిని పంచుకొంటూ నిద్రపోతోంది సెలయేరు. మందంగా పోతూ మరీ అంత పెద్దవికాని రాళ్ళని దొర్లిస్తూ, ఇంకా జాగ్రత్తగా పరికిస్తే చిన్న గలగలలు ఆహ్లాదం కలిగించేవిగా ఉన్నాయి. ఎడమ వేపు వరసగా పాతిన సర్వే చెట్లు, ఆపైన తెల్లగా పాపిటలాగు పొడవుపాటి ఇసికబాట. అడపాతడపా బస్సులు దారంట పోయినప్పుడు విపరీతంగా దుమ్ము లేస్తుంది. ఎదురుగ్గా కొండ పాదాల్ని ఒరుసుకొంటూ సెలయేరు మలుపు తిరిగి –

చేతిలో ఉన్న ప్లాన్స్ చూడాలనిపించడంలేదు. వాటినలాగే పట్టుకుని దూరాన ఒక రాతిమీదకు వచ్చి కూచున్నాను. జీపుముందు డోమ్‌కు చేరబడి కూచొని ఆ సాయంకాలాన్ని అతనే పాలిస్తున్నట్టు సిగరెట్టు కాలుస్తున్నాడు జాన్, పనిచేసే కూలీలతో పిచ్చాపాటి సాగిస్తూ.

ఒడ్డుదాకా గెంతుతూ వెళ్ళి నీటిలో రెక్కతడుపుకొంటోంది కాకి.

బాగా చీకటిపడడం నాకు తెలీదు.

"లేవెటరీలు కుడివేపు వరసగా వేయిస్తే బావుటుంది. సెలయేటి నీరు అక్కరకు వస్తుంది. ప్లాను కనిపించదేమో – కావ్యాత్తి తీసుకొచ్చాను" అంటూ విఠలరావు వచ్చి నా చేతిలో కాగితాలు అలానే ఉండడం చూసి విస్తుపోయేడు.

"అవును, కుడివేపే బావుంటాయి. సెలయేటి నీటిని అలా ఉపయోగించడం బావుండదు. బంతిమొక్కలు తెప్పించండి. ప్లాన్లు బావున్నాయి" అని అబద్ధం చెప్పేశాను. నా పరాకుని అంతసులువుగా అర్థం చేసుకోలేడు విఠలరావు. అందుకని అబద్ధాన్ని ఆసరా చేసుకోవడం తప్పని సరయింది. విఠలరావు వెళ్ళిపోయాడు.

దీపం పట్టుకుని ఎవరో కూలీ వచ్చాడు. అటు తిరిగి దీపం నీడలో మరెవరో వ్యక్తికూడా కన్పించారు. ఎర్రటి కెంపురంగు చీరె తెలుస్తోంది –

ఎవరన్నాను.

"చెప్పు" అని నీడలో ఉన్న వ్యక్తిని ముందుకు తోస్తున్నారు. దీపం వెలుగులోకి

వస్తే పంకజాన్ని గుర్తుపట్టి ఆశ్చర్యపోయాను.

ఇంకా తడబడుతోంది. "ఏం?" అన్నాను. కాని వెంటనే ఆమెకు అర్ధంకాదన్న విషయం గుర్తుకొచ్చింది.

"మీకేదో ఉత్తరం వచ్చిందంటండి - మాకియ్యనుంటే ఇవ్వదు, మీకే ఇత్తానంది."

ఇంకా అలాగే నిలబడి తటపటాయిస్తోంది.

"సూరయ్యా!" అని అరుస్తున్నాడు కంట్రాక్టరు.

"నేను వత్తా బాబూ - రోజు డబ్బులు పుచ్చుకోవాలి" - అని దీపం వదిలి పారిపోయాడు కూలీ.

"కూచో" అని సంజ్ఞ చేస్తే ఆమెకు బోధపడలేదు.

కొంగులోంచి తీసి ఓ టెలిగ్రాం ఇచ్చింది - సింగు మధ్యాహ్నం పంపాడు. ఇంత త్వరలో టెలిగ్రాం ఎందుకా అని ఆశ్చర్యమేసింది. తీర చూస్తే నన్ను ఉత్సాహపరచడానికి ప్రయత్నం - మాంఛి మొక్కజొన్న కండెలూ, ఓ పాతిక పుస్తకాలు సంపుతున్నాడట. నిరుత్సాహ పడకు - అని రాశాడు. నేను బిగ్గరగా నవ్వుతూంటే వింతగా చూస్తోంది పంకజం.

చేయిపట్టుకు ఎదురుగ్గా ఉన్న రాయి మీద కూచో పెట్టాను. త్వరత్వరగా మూగవాళ్ళతో మాట్లాడ్డం నేర్చుకోవాలనిపించింది. మొదటి పాఠం ప్రారంభించాను.

"నీ పేరేమిటి?" అన్నాను వీలయినంతవరకు సంజ్ఞలను ఉపయోగిస్తూ.

మొదట చెప్పటానికి సిగ్గుపడింది. ఏదో అనబోయింది. నాకింకా అర్థం కాకపోవడం చూసి రాతిమీద వేలుతో పెద్ద అక్షరాలు రాసింది. "పం... ...క.. ...జం".

ఒక్కసారి మాట్లాడేస్తే ఏవేవో చెప్తోంది - ఉత్తరం తీసుకురావటానికి చాలా అలసిపోయాను అంటున్నట్టుంది బహుశా - వింటూ కూచున్నాను.

"ఇక పోదామా సార్ - చీకటి పడింది" అంటూ వచ్చాడు జాన్.

"జీప్‌లో వస్తావా?" అన్నాను లేచి.

అర్థంకాలేదు - సంజ్ఞ చేశాను.

"ఇదెందుకు సార్ - వాళ్ళ మావ ఎవరో ఉన్నాడు. వాడితో పోతుంది" అంటున్నాడు జాన్.

"ఫరవాలేదులే. ఇటువేపు తీసుకురా జీపను" అని నడిచాను.

జీప్‌లో కూర్చొన్న దగ్గర్నుంచీ ఒకటే హడావుడి చేస్తోంది పంకజం. వెనకసీట్లో పక్కనే ఒదిగి కూచుంది. బండి గతుకుల్లో లేచి పడినప్పుడల్లా పక్క ఊచని పట్టుకుని తుళ్ళి పడుతోంది. ఉండుండి రోడ్డు మీద పోయేవాళ్ళని పిలిచి, పెద్ద కేకలు పెట్టి పలకరిస్తోంది. అంతా విచిత్రంగా చూస్తున్నారు. ఆమె అరుస్తున్న కొద్దీ జాన్ మరీ గతుకుల్లో పోనిస్తున్నాడు జీపను.

మలుపు తిరగడంతో తూలి భుజానికి ఆనుకుంది. తలలో పిచ్చి పువ్వులు

ముఖానికి రాసుకుంటున్నాయి. పువ్వుల్లో సువాసన లేదు – పచ్చి ఆకుల వాసన బుర్రంతా వ్యాపించింది – మౌనంగా బయటికి చూస్తూ కూచున్నాను. ఉండుండి లైటు వెలిగించాడు జాన్. అంత వెలుగు చూడలేక ఒక్కసారి కళ్ళు మూసుకొని జారిపోయిన పమిటను వెదుక్కొంటోంది. నావేపు వింతగా చూస్తోంది. ముఖానికి గుచ్చుకొంటున్నాయని తలలో పువ్వులు తీసేశాను. లేత కనకాంబరం రంగు వెలుగులో వెలిసినట్టు కన్పించింది.

దీపం ఉంచవద్దని జాన్ భుజంమీద కొట్టోంది. వాడు నవ్వుతున్నాడు. కాస్సేపటికి ఆర్పేశాడు. ఇంక అల్లరి చెయ్యలేదు పంకజం.

నా వీపుకు వెనక 'రైల్' గుచ్చుకొంటోంది. అంత ఇరుకులో తప్పించుకోవడం సాధ్యం కావడంలేదు. కొద్దిగా లేవబోతే బండి గతుకులో పడింది. తూలిపోయి పక్కకి జారబోయాను. పంకజం ఆపింది. మెడమీంచి ఎడమ భుజంమీదికి చెయ్యివేసింది. వీపుని వెచ్చని శ్వాస కాలుస్తోంది. రొమ్ము బలంగా భుజాన్ని ఆనుకుంది. బండి నడిచే శబ్దంలో గాలి రివ్వుమంటోంది. లేవాలనిపించడంలేదు. నుదురుకి చిన్న దెబ్బ తగిలి జివ్వుమంటోంది. పంకజం చీకటిలో దొంగలా మాట్లాడ్డంలేదు. కుడిభుజం చెమటపట్టి నా వీపంతా తడిసింది. తప్పించుకోకుండా భుజం మీద చెయ్యివేసి దగ్గరగా అదుముకున్నాను. పెద్ద అపాయం నుంచి తప్పించుకొనేందుకు అవకాశం దొరికినట్టు ఒదిగిపోయి – ఇంకా కుచించుకు పోయి – చేతుల్లో ఇమిడిపోయింది పంకజం.

మేడముందు జీప్ ఆపి లైటు వెలిగించాడు. పంకజం వెలుగులో ముఖం చూడలేకపోతోంది. పువ్వులకోసం తల వెదుక్కొని నా చేతిలో చూసి నవ్వుకుంది. మోకాళ్ల మధ్య తల ఆనించుకు ఇంకా అలానే కూచొంది.

"జీప్ ప్రయాణం బాగా వంటపట్టినట్టుందే! దిగు" అని చెయ్యి పట్టుకొని లాగుతున్నాడు జాన్. వాడివేపు చురచుర చూస్తూ ఉన్నట్టుండి ఒక్కసారి చెంపమీద కొట్టి గెంతుగెంతి పారిపోయింది. నివ్వెరపోయాడు జాన్.

నాకు ఒకటే నవ్వు –

ఆ తర్వాత చాలా విషయాలు త్వరత్వరగా జరిగిపోయాయి. పంకజం ఇరవై నాలుగు గంటలూ ఇక్కడే మేడలో ఉంటుందనీ 'కొత్తగా వచ్చినాయన దాన్ని తనతో తీసుకువెళతాడంట' అంటూ చాలా మంది ఊళ్ళో గుసగుసలు ప్రారంభించారని జాన్ చెప్పాడు. నేను నిర్ఘాంతపోయాను. ఆలోచించినకొద్దీ భయమేసింది.

క్రోటన్సు మొక్కలకి నీళ్లు పోస్తోంది పంకజం. ఈ విషయమంతా చెప్పేసి "నువ్వేమంటావ్?" అని అడగాలని ఉంది. ఒక్కసారిగా బెదిరిపోయి ఏడుస్తుందేమో – ఇన్ని విషయాలు ఎలా చెప్పాలో తెలీదు నాకు. కుర్చీమీద ఎండపడి నుదుటిని కాలుస్తోంది. "కాఫీ కావాలా బాబూ" అంటూ ముసిల్ది వచ్చింది.

"ఇదిగో చూడు" అని పిలిచానే కాని ఏం చెప్పాలో తోచలేదు.

"పంకజం గురించి ఊళ్ళో చాలామంది ఏవేవో అనుకుంటున్నారట"

మొదట తెల్లబోయింది వృద్ధురాలు.

"ఎవరు బాబూ!"

"పోనీ నా గురించి - అనుకుంటున్నారా?"

"ఏ విషయం బాబూ?"

విసుగేసింది అంతా చెప్పడానికి - "ఇదుగో అమ్మీ! వాళ్లేమనుకున్నా నాకనవసరం - రేపట్నుంచి పంకజాన్ని ఇక్కడ పనిచెయ్యవద్దని చెప్పు. నువ్వే పనిలోకి రా"

మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

మధ్యాహ్నం ఆలోచిస్తే ఉదయం తొందరపడ్డానేమో అనిపించింది. పంకజానికి ఆ విషయాలన్నీ తెలిస్తే బాధపడవచ్చు. కాని అప్పట్లో ఇక అంతకంటె మరో గత్యంతరం లేదు. ప్రభుత్వ ఉద్యోగిగా. ఇల్లాంటి విషయాలు ఉద్యోగానికి భంగం కలిగిస్తాయి - మళ్ళీ సాయంకాలానికి 'మంచిగానే జరిగిందని' స్థిమితపడ్డాను.

అటు తరువాత మరి పదిరోజుల వరకు పంకజం కన్పించలేదు. ఇళ్ళ పనికూడా ఓ కొలిక్కి వచ్చింది. పునాదులు పూర్తయి సగం గోడలు లేచాయి. రెండు పూటలా అక్కడికి వెళ్ళి వస్తున్నాను.

ఓ సాయంకాలం జీప్ పాడయిందన్నాడు జాన్. "స్పేర్ పార్ట్‌లు తెచ్చుకోవాలి. విజయవాడ వెళ్ళివస్తాను సార్" అన్నాడు. వెళ్ళమన్నాను.

మర్నాటి సాయంకాలం పని జరుగుతున్న చోటికి వస్తూంటే దారిలో ముసిల్ది కనిపించింది. పంకజానికి జ్వరంగా ఉందట, ఎవరో బంధువును పిలుచుకు రావడానికి వెళ్తున్నానంది.

నేనాశ్చర్యపోయాను. మరి నాతో చెప్పలేదేం? - "మీకు కోపం వస్తుందని భయపడ్డాను బాబూ - ఆ రోజు నుంచి అటువేపు వెళ్ళొద్దని దానికి గట్టిగా చెప్పాను".

"నేను వస్తాను పద" అని ఇంటికి వెళ్ళాను.

నీరసంగా గుడిసెరాటకి చేరబడి కూచొని ఉంది పంకజం. చూసేసరికి భయమేసింది. నల్లటి చీరెమీద తెల్లటి చుక్కలు దీపం వెలుగులో స్పష్టంగా కన్పిస్తున్నాయి.

నన్ను చూసి తన కళ్ళను తానే నమ్మలేక విస్తుపోతోంది. ఎల్లా పలకరించాలో తెలీలేదు. అరుగుమీద కూచున్నాక నవ్వాను.

అంతలో ముఖం పక్కకు తిప్పుకు ఏడుస్తోంది.

"ఏమిటి రోగం?"

"తెలీదండి. నీరసంగా ఉంటుంది-మాట్లాడదు. అడిగితే ఏమీ బదులు చెప్పదు."

అమ్మని పిలిచి అంతలో ఏదో చెప్తోంది పంకజం - ముక్కుమీద వేలేసి చూపుతూ, 'తప్పు' అంటోంది ముసిల్ది.

"ఏం చెప్పుంది?"

"పిచ్చిది – దానికేం తెలీదు బాబూ!"

ఇంకా ఏడుస్తోంది నిశ్శబ్దంగా –

"ఊర్లో అన్నమాటలు విన్నాక దాని మనస్సు పాడయింది బాబూ – మిమ్మల్ని వెళ్ళిపొమ్మని చెప్పమంటోంది" మనస్సు కలుక్కుమంది.

మెల్లగా లేచి మంచం మీద తల ఆనించి పడుకొంటోంది.

"నేను వెళ్తాను – ఏం రోగం ఉన్నట్టు లేదులే" అని వచ్చేశాను – గుమాస్తాలంతా వెళ్ళిపోయారు. అంత చీకటిలోనూ తెల్లటిదారి పాముపొరలా కనిపిస్తోంది.

పంకజానికి మాటలాడడం వస్తే బావుణ్ను అనిపించింది. నిశ్శబ్దానికి అర్థం ఒక్కొక్కప్పుడు మనస్సునిమించి పెరిగిపోతుంది. పంకజం మౌనానికి అర్థం చెప్పగల యంత్రాలేవుంటే పెద్ద సృష్టి రహస్యం బయటపడేది.

ఆ కళ్ళల్లో దైన్యం, నిస్సహాయత ఇంకా మరుపురావడం లేదు. బంగళాకు రావచ్చునని వాళ్ళ అమ్మతో చెప్తే బాగుంటుందేమో? – ఏం చెయ్యడానికి శక్తి చాలడం లేదు. ఇంత చిన్న ఊరులోనూ ఓ సంఘం అంటూ ఏర్పడింది. ఆ సంఘం చాలు మా మంచి చెడ్డలను బేరీజు వెయ్యడానికి –

తలవొంచుకు నడుస్తున్న వాడినల్లా రాయితన్నుకు పడబోయాను. కాని చీకటిలో ఎవరినో అనుకున్నాను. రెండుపక్కలా దట్టంగా చెట్లు, అప్పుడే లేచే చతుర్దశి చంద్రుడి వెన్నెల చారలు –

"కళ్లు కన్పించవురా నీకు?" అంటున్నాడా వ్యక్తి. జవాబు చెప్పకుండా, పక్కకి తప్పించుకు వెళ్ళిపోబోయాను – వెనక నుంచి పిలిచాడు.

"ఒరే – ఇలారా."

నివ్వెరపోయాను. గొంతులో గరుకుతనానికి గుండె వణికింది – అసంకల్పింతంగా వెనక్కు నడిచాను.

"నువ్వేనా ఆ ఇళ్ళు కట్టిస్తున్నది?"

"అవును. ఏం?"

"పెబుత్వం అంటే నువ్వేనా?"

"నేను కాదు."

"మీరేలే – ఈళ్ళంతా ఎదవలు. ఆళ్ళకి ఇళ్ళిత్తే రేపు నిన్నూ పెబుత్వాన్నీ తంతారు. నీకేటెరిక?"

"అది నాకనవసరం" నడవబోయాను.

"ఒరే – మాటినిపించుకోయేస్"

"ఏవిఁటి చెప్పు?"

"పంకి నెరుగుదువా?"

"ఎవరూ?"

"ఇదిగో, ఏసొలెయ్యకు – ఒక్కటి చెప్తాను విను. పంకితో నువ్వు మాట్లాడానికి వీల్లేదు. మాణిక్యంగాడి సంగతి నీకు తెలీదు. గుర్తుంచుకో" అన్నాడు.

అంత శరీరాన్ని చీకటిలో చూడడానికి భయంగానే ఉంది. చవకబారు కల్లువాసన భరించగానిదిగా ఉంది. ఏం జవాబు చెప్పకుండా నడిచాను –

వెనకవాడు నవ్వుతున్నాడు.

* * * * *

ఉదయాన్నే కంట్రాక్టరు వచ్చాడు – ఇళ్ళ దగ్గరికి బయలు దేరడానికి.

"మాణిక్యం అనేవాడు తెలుసా మీకు?"

మొదట నన్ను ఆశ్చర్యంగా చూశాడతను. "అసలు వాడిపేరు ఎలా తెలిసింది మీకు?"

"చెప్పండి."

"వాడో విధంగా ఈ ఊళ్లో రాజ్యం ఏలుతున్నాడండి. వెనక ఐదుమంది జెమా జెట్టీలు మద్దతున్నారు. నాలుగేళ్ళక్రితం ఓ దొమ్మీ కేసులో రాత్రికి రాత్రి ఓ బొమ్మల కంపెనీ మేనేజరు మేనల్లుడ్ని సఫా చేసేశారు. సబ్‌ఇన్‌స్పెక్టరు ఇద్దరు పోలీసుల్తో పరిశోధనకు వస్తే ఊరు పొలిమేరల్లోనే వాడికి బుద్ధి చెప్పి తగిలేశారు. రెండు నెలలు తిరక్కుండానే ఆ సబ్ ఇనస్పెక్టరు తెలంగాణాకు బదిలీ చేయించుకున్నాడు. తెలిసి వాడితో ఎవరూ నోరు కలపరండి – రెండు భుజాలూ రెండు ఆయుధాలు వాడికి –"

అంతే, ఆ తర్వాత మాణిక్యం గురించి అడగలేదు. కాని పంకజం ప్రస్తావన వాడెందుకు తీసుకువచ్చాడో అర్థం కావడంలేదు. పునరావాసాలు కట్టడం వాడికి ఇష్టం లేనట్టుంది. అయినా ఏవిధంగానూ నేను ఆపలేను – కాకపోతే పంజంతో మాట్లాడడం మానుకోవడం తప్ప. కాని మాణిక్యం అంత భయపడవలసిన వ్యక్తా? ఆలోచన పెరిగికొద్దీ చికాకు ఎక్కువయింది. ఓసారి మాణిక్యాన్ని కలిస్తే బావుణ్ననిపించింది.

తర్వాత నెలరోజుల వరకూ ఆవిషయాలే మరచిపోయాను. సమయానికి సిమెంటు రాలేదు. అందువల్ల పని ఆగిపోయింది. ఇద్దరు సూపర్‌వైజర్లు పరిస్థితిని గమనించడానికి వచ్చారు. బృహత్తర ప్రయత్నంతో మళ్ళీ నెలతర్వాత పని సజావుగా సాగనారంభించింది. ఓ రోజు ముసిల్ది కనిపించి, "పంకజం తేరుకొంది బాబూ!" అని చెప్పిన జ్ఞాపకం మాత్రంఉంది.

సింగు పిల్లల్ని చూడడానికని 15 రోజులు సెలవుపెట్టి మధ్యప్రదేశ్‌కు వెళ్ళాడు. ఇక నాకెవరూ తోడు మిగల్లేదు. నన్ను అర్థం చేసుకుని సాధక బాధకాలు గమనించేవారు డిపార్టుమెంటులో ఎవరూ లేకపోవడంతో రెండు నెలలు ఇక్కడ ఉండాల్సిన గడువు ఇంకా ఎక్కువయే ప్రమాదాలు కనిపించాయి.

ఒకరోజు మరీ చీకటిపడ్డాక విజయవాడ జీపులో వెళ్ళి తిరిగి వచ్చేసరికి మేడమెట్ల మీద కుంచించుకుపోయి పంకజం పడుకొని ఉంది. పువ్వుల్తో ఒళ్ళు విరిచిన కొమ్మను నేలను విసురుగా పడేస్తే ఎలా ఉంటుంది? – అలా –

రోగం పెద్దది కాకపోయినా పంకజం ముఖంలో ఎరుపును మింగేసింది. నుదుటికి పెట్టుకున్న పెద్దబొట్టు నిద్రమత్తులో వేలికి రాసుకు ముఖమంతా పాకింది. నిద్రలోనే పెదాల్ని తడిచేసుకుంటోంది.

తట్టి లేపితే తుళ్ళిపడింది. ఎవరో కొత్తవ్యక్తిని చూస్తున్నట్టు వింతపడుతోంది – ఒక్కసారి చుట్టూ గమనించి నా వేపే తదేకంగా చూస్తోంది. దీపపు నీడలో కళ్ళల్లో ఆకలి పూర్తిగా అర్థం కావడంలేదు. ఆశ్చర్యమేమో? – ముఖం దీపం వేపు తిప్పబోతే చెయ్యితీసి ముఖం తప్పించుకుంది. అంతలో మెట్ల దగ్గర గోడకి చేరబడి ఏడుస్తోంది.

నాకు విసుగేసింది.

మాటలురాని తనకు కన్నీటిని ఆయుధంగా చేసుకున్నదేమోననిపించింది. నిశ్శబ్దం దొంగతనానికి చిహ్నం – ఆ కళ్ళల్లో అమాయకత్వం – చూపులో జాలి తప్పిస్తే పంకజంలో నమ్మకం కలగడానికింకే కారణమూ కనిపించదు.

కుర్చీలో కూర్చొంటే విపరీతంగా తలనొప్పి ప్రారంభమయింది. మరో పావుగంటకు పంకజం భోజనం తీసుకు వచ్చింది. ఇప్పుడిక ఏడవడంలేదు. బల్లమీద భోజనం ఉంచి బాల్కనీ గోడకి ఆనుకుని కూచొంది.

నిశీథి నిశ్శబ్దాన్ని ఏదో కొత్త ప్రపంచం నుంచి దాచడానికి రహస్యంగా కప్పిన తెరలా ఉంది ఆకాశం – పంకజం అటువేపు కళ్ళు తిప్పితే – ఆకాశం నలుపు కళ్ళల్లో ప్రతిబింబం చూసుకొంది. ఏడుస్తోందేమోనని ఎదురుగ్గా వచ్చి నిలబడ్డాను. ఇందాక ఆమె కన్నీటిపై విసుగుదలను బాగా అర్థం చేసుకున్నట్టుంది. చిన్నగా నవ్వింది. ఉత్సాహం కాదు, తృప్తికాదు – దుఃఖాన్ని దాచుకొంటూ. అసహాయతకు 'ఓర్పు' రంగు వేసి నవ్వటి ప్రయత్నం ఆ నవ్వులో – అదీ ఆ నవ్వుకి అర్థం.

"ఎందుకేడుస్తావ్?" అనడిగాను –

నా ముఖంలోకి చూస్తోంది. నాకు అర్థమయ్యేట్టు చెప్పగలనా అని ఆలోచిస్తోందేమో? – ఆ తడబాటు, సందిగ్ధం – ఏదో చెప్పబోయి చెప్పలేని ప్రయత్నం – భయంతో రొమ్ము ఎగిరిపడే బిడియం – ఏదో వింత శక్తిని చూస్తున్నట్టు – అలాగే నిలబడిపోయేను.

అంతలో లేచి – నా కళ్ళను తప్పించుకొని భోజనం పళ్ళెం తీసుకొచ్చి నా ముందుంచింది.

భోజనం ముగించేస్తే వెళ్ళిపోతుందేమోనన్న లోభత్వంతో తినకుండా నిశ్శబ్దంగా ఉండిపోయాను.

భోజనం ముగించేవరకూ అలానే కూచుంది.

బయట సన్నగా చినుకులు ప్రారంభమయ్యాయి - ఆమె అలాగే నావేపు చూస్తుంది.

నాకు మాట్లాడడం తెలీదు.

అంతే!

* * * * * *

సింగు వచ్చాడు. మధ్యప్రదేశ్ నుంచి విచిత్రమైన పళ్ళు తీసుకొచ్చేడు. "ఎల్లావుంది, ఇక్కడి బ్రతుకు?" అంటాడు నవ్వుతూ.

"మనస్సేం బావుండడం లేదు - విజయవాడే నయమేమోననిపిస్తుంది - మరీ ఎక్కువ విశ్రాంతి లభిస్తే ఏం చెయ్యాలో తెలీదు. ఎక్కువ సంతోషం నుంచి దుఃఖంలాగా, పూర్తి విశ్రాంతిలోంచి భయం, పిరికితనం పుట్టుందేమో" అన్నా.

ఇవన్నీ అర్థం చేసుకోడు సింగు.

"స్త్రీలు మాట్లాడకుండానే చాలా విషయాల్ని చెప్పగలరు భయ్యా! - వాళ్ళకళ్ళకి సరయిన అర్థం చెప్పగల డిక్షనరీ నీ దగ్గర ఉండాలి. అదీ రహస్యం" - అని భుజం తట్టాడు. ఎవర్ని ఉద్దేశించి అంటున్నాడో తెలీక తెల్లబోయేను. నవ్వేడు సింగు. అంతే మరింకేమీ చెప్పలేదు.

తర్వాత పదిరోజులకు అనుకొంటాను - ఈ సంఘటన జరిగింది.

అంతవరకూ మళ్ళీ మాణిక్యాన్ని కలవలేదు. దాదాపు ఆలోచనలే మరిచిపోయేను.

కాని ఓ రోజు ప్లాటు దగ్గర నుంచి జీప్‌లో వస్తున్నాను. జాన్ ఏదో మాట్లాడుతున్నాడు. వీలయితే తనకు కొండపల్లిలోనే ఉండిపోవాలనుందిట. "గవర్నమెంటు ఉద్యోగులందరినీ ఇక్కడ రెండు నెలలు ఉంచి పంపాలండీ - ప్రతివాడూ ఒక వేదాంతో, కవో అయి ఊరుకొంటాడు" అంటున్నాడు.

రాతి మీద కర్రల మోపు దించి అలసట తీర్చుకుంటున్న పంకజం కన్పించింది - జాన్ చూశాడు. "కర్రలు మోయడం, నీళ్ళు తోడడం మొదలయిన కొన్ని ప్రత్యేకమైన పనులను దేవుడు స్త్రీలకే ప్రత్యేకించాడు సార్. ఆ సమయాల్లో వాళ్లు మరీ అందంగా కనిపిస్తారు - చూడండి కావలిస్తే."

పళ్ళు బిగపట్టి కాలిలో ముల్లు తీసుకొంటోంది, రాతికి ఆనుకుని. పసుపుపచ్చటి చీరె మరీ తేలికయి తెరచాప కట్టినట్టు వెనక్కు ఊగుతోంది. శరీరం వంపులన్నీ సాయంకాలపు నీడల్లో కలిసిపోయి, కుంచె గీసిన రేఖల్లా కన్పిస్తున్నాయి.

"ఒక్కసారి జీపు ఆపు"

"ఎందుకుసార్? - కట్టెల్ని మోయనివ్వకుండా చేయడంలో మనం ప్రపంచానికి చాలా ద్రోహం చేస్తున్నామన్నమాట. ఇంకా ఆ అందాన్ని దారిలో చాలా కోణాల్లో చాలామంది చూడవలసి ఉంది" - తన మాటలకి తానే విరగబడి నవ్వుకుంటున్నాడు జాన్. ఒక్క

కుదుపుతో జీప్ ఆగిపోయింది. వెనక్కి చేరబడి స్టీరింగు మీద తల ఆనించాడు.

జీప్ దిగి రాయిదగ్గరికి నడిచేను. ముల్లు తీసిన చోటునుంచి పంకజం కాలిలో రక్తం వస్తోంది. నోటిలో ఉమ్మితీసి తడిచేసి ఇసుక పోస్తోంది. నన్ను చూసి లేచి నిలబడబోయి పక్కన పారేసిన ముళ్ళ కొమ్మ మీద మళ్ళీ కాలేసింది. బాధతో తూలిపడబోయి భుజంమీద చెయ్యేసింది. ఈసారి రెండు చోట్ల ముళ్ళు గుచ్చుకున్నాయి.

నా పక్క చూడడం లేదు. చుట్టూ గమనిస్తోంది. జాన్ జీప్‌ను 20 గజాలు ముందుకు పోనిచ్చాడు.

నేను వచ్చినప్పటికంటె ఇప్పుడు మరీ నిశ్శబ్దంగా ఉండడం అలవాటు చేసుకుంది.

"నేను ఇక్కడినుంచి వెళ్ళిపోతున్నాను" – సూచించాను.

ఆశ్చర్యంతో చూస్తోంది. "ఎప్పుడు" అని అడగలేదు. ఆశ్చర్యం తప్ప ఇంకేభావమూ కన్పించదు.

ఏదో అసంతృప్తిగా ఉంది. "నువ్వు నాతో తిరుగుతున్నావని, లేకపోతే నేను నీతో తిరుగుతున్నాని అందరూ అనుకొంటున్నారు" అని చెప్పడం నా ఉద్దేశం. కొన్ని క్షణాలు నాలో నేనే గుంజాటనపడి చెప్పబోయాను. ఇంకేదో విధంగా అర్థం చేసుకున్నట్టుంది. గుండెమీద రెండు చేతులూ గట్టిగా ఆనించుకుని "నేను రాను" అని సూచిస్తోంది. నాకు నవ్వొచ్చింది. ఫక్కున నవ్వేశాను. విచిత్రంగా చూస్తోంది. నిలబడి రాయికి ఆనుకోబోతే చెయ్యి పట్టుకుని కూర్చోపెట్టాను.

అంత దగ్గరగా పంకజాన్ని చూడడం రెండవసారి. కుడివేపు నుదుటిమీద మచ్చ ఎప్పుడూ చూడలేదు నేను –

కొంతసేపు నిశ్శబ్దంగా కూర్చొని లేవబోతూ పంకజాన్ని చూశాను – మళ్ళీ ఏడుస్తున్నదేమోననిపించింది. భుజం మీద చెయ్యేసి కదిపితే నవ్వేసింది – ముఖం కప్పుకొంది. తలమీంచి భుజం మీదకు నీరసంగా వాలిన అడివిపువ్వులు, చల్లగా చేతిని కొరుకుతున్నాయి. తలమీద చెయ్యివేస్తే ఆ చల్లదనం వొళ్ళంతా పాకింది. అంతకుమించి నీలిరంగు రవికె బరువూ – పెదాల వొణుకూ, ఆశ్చర్యం – ఒక్కసారి పంకజాన్ని కావలించుకోవాలనిపించింది.

కాని పిరికితనం – జాన్ దూరంగా హారన్ మోగిస్తున్నాడు.

వెళ్తున్నాని కూడా చెప్పకుండా జీప్‌వేపు నడిచాను. జీప్‌లో కూచున్నాక వెనక్కి చూస్తే, దుఃఖంతో మెత్తబడిన కళ్ళను అట్లాగే సాయంకాలం మసకచీకటిలోకి తొనిపి మావేపుచూస్తూ కన్పించింది పంకజం–మనస్సంతా ఆర్ద్రతతో, పంకజంమీది తెలిని సానుభూతితో వణికింది.

నేను దిగులుగా కూచోవడం గమనించి – "అంతేనండి – ఆడవాళ్ళతో మాట్లాడడాన్ని ఊహించుకోవాలేగాని వాళ్ళతో మాట్లాడకూడదు. అందువల్లనే కథల్లో ఆడవాళ్ళూ, కలల్లో ఆడవాళ్ళూ బావుంటారు. ఇక పంకజమా! ఉఫ్! – హెచ్చు

ఆలోచించకండి సార్ – అది కొండపల్లి ఆటబొమ్మ" – అని ఏక్సిలరేటర్ నొక్కాడు. జీప్ కుదుపులను సహిస్తూ ఆలోచనలకు తావివ్వని శబ్దంతో మాశరీరాలను లాక్కుపోతోంది.

ముప్పై గజాలు నడిచిందో లేదో ఎవరో జీప్‌ని ఆపమని అరుస్తున్నారు.

జాన్ భయపడ్డాడు మొదట. జోరుగా హారన్ మోగించాడు. కాని జీప్ ముందున్న వ్యక్తి తప్పుకోవడంలేదు. చివరికి ఇక తప్పనిసరిగా ఆపేశాడు.

ముందు లైటులో మాణిక్యాన్ని గుర్తుపట్టాను నేను. భుజంమీద నల్లగళ్ళ తువాలు, జబ్బలకు వెండి తావీజు, చేతిలో పొట్టికర్ర – మరో చేతిలో సగం విరిగిన సీసా–

జీప్‌లోంచి దిగాలనిపించలేదు నాకు. జాన్ మాత్రం సర్దుకున్నాడు. మాణిక్యం దగ్గరికి వచ్చి లోపలికి వంగితే కల్లువాసన గుప్పుమంది.

"ఒరే కిందకి దిగు" అన్నాడు నన్ను చూసి.

"ఎందుకు?" అందామంటే గొంతు విడడం లేదు.

ఇంకా తటపటాయిస్తే చెయ్యి పుచ్చుకొన్నాడు. చెమటతో, మట్టితో తడిసిన చెయ్యికింద నా వేళ్ళ నరాలు బలహీనంగా వణుకుతున్నాయి.

"చెయ్యి వదులు, దిగుతాను."

దిగాక – మాణిక్యం ఏదో మాట్లాడబోయి, శరీరం తూలిపాటును ఆపుకోలేక బండిని ఆనుకుని నిలబడ్డాడు.

"ఒరే, నిన్ను దానితో మాట్టాడొద్దని చెప్పానా?"

"ఎవరితో?"

"నోర్మెయ్ – ఎవరితోనో నీకు తెలీదూ? – సీసా పగిలిపోయింది – లేకపోతే నిన్ను చంపేవాడినే?" –

"ఎందుకూ చంపడం?"

"చస్, మాట్టాడేవా, లేదా చెప్పు"

"ఆ అమ్మాయికీ నీకూ ఏం సంబంధం?"

కర్రతో జీప్‌మీద బాదాడు. "అవన్నీ అడక్కోసిన్నె, ఇదిగో, చెప్తున్నాను – రెండ్రోజుల్లో నువ్వు ఊరొదిలిపోవాలి – లేకపోతే బ్రతికుండగా గోరీ కట్టేస్తాను – నా బలం మీద నమ్మకం లేకపోతే ఊర్లో పదిమందిని అడుగు."

జాన్ ఏదో అల్లరి చెయ్యబోయి కొట్టడానికి కారు హేండిల్ తీయబోయాడు. అంతే – కన్నుమూసి తెరిచేలోపల చేతికర్రలోంచి పెద్ద కత్తిని దూసాడు మాణిక్యం. అంతలో నిశ్శబ్దం వణికేలా నవ్వి "ఎవడీ పిచ్చిక?" అంటున్నాడు.

నాకు నిజంగానే భయమేసింది. మాణిక్యానికి కళ్ళు మూతలు పడుతున్నాయి. ఇప్పట్లో మాట్టాడడం మంచిదికాదనుకున్నాను. "వదలండి – ఈ వెధవని ఒక్కదెబ్బతో చంపేస్తాను" అని జాన్ అరుస్తున్నాడు. బలవంతంగా జీప్‌లోకి ఎక్కించాను –

మాణిక్యం రోడ్డుపక్క నిలబడి బూతులు తిడుతున్నాడు. జీప్ బయలుదేరుతూంటే లోపలికి తలవంచి "మరిచిపోకురోయ్ – రెండ్రోజుల్లో దొబ్బెయ్యాలి" అంటున్నాడు.

"ఎవడండీ ఆ స్కౌండ్రల్ – వదిలితే హుండిల్లో పొడిచేద్దును" –

కాస్త ఆగి – "రేపు ఉదయం వెళ్ళి సింగుగారిని పిలుచుకురా జాన్! – ఎవరికీ ఈ విషయం చెప్పకు" అన్నా.

"ఈ కుక్కకి మళ్ళీ ఆయనెందుకండీ – రేపు ఇద్దర్ని తీసుకొచ్చి వీడి ప్రాణం తోడేస్తాను."

మాణిక్యం నన్ను తిట్టిన బాధకంటె, అర్థంకాకుండా తెరవెనుక ఉండిపోయిన రహస్యాల సందిగ్ధత ఇంకా బాధపెట్తోంది. మాణిక్యానికి పంకజం ఎల్లా తెలుసు? – పంకజం ఎప్పుడూ ఏడుస్తూంటుంది. ఎందుకని? – ఇట్లాంటివి.

* * * * *

రెండురోజుల తర్వాత అనుకుంటాను సరిగా గుర్తులేదు ఓ రోజు ఉదయాన్నే– తోటలో మాణిక్యంతో పంకజం తల్లి మాట్లాడుతూండగా చూశాను – చెట్టుదగ్గర సిమ్మెంటు బెంచీమీద కూచొని బీడీ వెలిగిస్తున్నాడు – ఏదో విసురుగా మాట్లాడుతూ మధ్యమధ్య మేడవేపు చూస్తున్నాడు.

మేడదిగి సరాసరి తోటలోకి వచ్చాను. నన్ను చూసి పంకజం తల్లి తడబడుతోంది.

"నమస్కారం సాబ్!" అంటున్నాడు మాణిక్యం నవ్వుతూ. నవ్వులో నిర్లక్ష్యం తెలుస్తూనే ఉంది.

వినిపించుకోలేదు నేను – "ఎవడు వీడు?" అన్నాను పంకజం తల్లితో.

"నీకెందుకయ్యా అది?" అన్నాడు మాణిక్యం.

"నువ్వు మాటాడకురా" అని అదిలిస్తోంది.

నాకు విసుగేసింది. "ఇట్లాంటి వేషాలేవీ నాకు పనికిరావు, పోలీసులకి రిపోర్టు నిన్ననే పంపించాను. నేటికి వస్తారు. ఇద్దరూ పోలీసుస్టేషన్లో జవాబులు చెప్పుకోండి" అని వచ్చేశాను.

అన్నానేకాని మాణిక్యం వాళ్ళకి దొరకడని ఎల్లాగూ తెలుసు.... కొన్ని క్షణాలు గడిచాక, అల్లా అనడం నాకే ముప్పు అన్న విషయం హఠాత్తుగా స్ఫురణకు వచ్చింది.

మొత్తం మీద కొండపల్లి జీవితం మీద ఏదో దిగులు ముసుగుకప్పుకొన్నట్టనిపించింది. పంకజం ఆలోచన స్థిమితాన్ని ఇవ్వడం లేదిప్పుడు. ప్రతీ వ్యక్తీ ఏదో ప్రళయాన్ని దాస్తున్నట్టూ – దొంగతనంగా బ్రతుకుతున్నట్టూ అనిపించింది. ఆ దొంగతనం ఈ స్థలంలోనే ఉందేమో – పిచ్చివాళ్ళని చూసిన కాస్సేపటికి, ఎవరికి నిజంగా పిచ్చో అర్థంకానట్టూ, కొన్నాళ్ళయేసరికి మనలోనే ఆ దొంగతనం ఉన్నదా అనిపించేట్టుంది పరిస్థితి. మనగురించి ఎవరూ ఆలోచించకపోవడంలోనూ తృప్తి ఉంది – అందరి దృష్టిలో ఉంటూ బ్రతకగలగడం జీవితానికి పెద్ద శిక్ష.

"భగవాన్! నేడు ఒక్క క్షణం బ్రతికే అవకాశం కల్పించు" అనుకోవడం ఎంత హాయి!

వారం రోజుల తరువాత పని ఎల్లా జరుగుతోందో చూడడానికి సింగువస్తే ఇక్కడ రోజులు గడపడం ఎంత దుర్భరంగా ఉందో వివరించాను.

"ఏం?" అన్నాడు ఆశ్చర్యపోతూ.

"ఇంత నిశ్శబ్దంగా – ఈ కొండలూ, చెట్లూ, సెలయేరూ, ఎంత సేపూ సంస్కారంలేని మనుషులతో గడపడం – రచనకు కూడా ఓ మీడియమ్ కావాలేమోగాని – ఇంత గుండెబద్దలు చేసే శూన్యం మాత్రం కాదు. ఇక్కడ నాలాంటి వాళ్ళుకాదు, ఋషులు తపస్సు చేసుకొందుకు బాగుంటుంది. ఇది ప్రశాంతం కాదు, భయంకరమైన ప్రళయం" అన్నాను.

అవేం బోధపడలేదు సింగుకి.

"ఆ అమ్మాయి ఏదన్నా గొడవచేసిందా?"

"ఏ అమ్మాయి!"

నవ్వేశాడు.

"ఆ దొంగవెధవకి భయపడుతున్నావల్లే ఉందే!–అదంతా నే చూస్తాలే."

ఇంకా ఆశ్చర్యపోతున్న నా భుజం తట్టి "జాన్ నాకంతా చెప్పాడులే – నువ్వంటే వాడికి అభిమానవేఁ" అన్నాడు మెల్లగా.

ఆ తర్వాత మరీ విసుగుపుట్టింది రోజులు గడపడానికి – పంకజం రావడం పూర్తిగా మానేసింది – నిర్లక్ష్యంతో నా మీద ఏదో పగ తీర్చుకుంటూ, నేను చేసినపని తప్పని ఎత్తి చూపుతున్నట్లు కన్పించింది.

పోలీసుల భయం చూపి, ఏమీ చెయ్యలేకపోయిన నన్ను పరిహసిస్తున్నట్టుగా మేడముందు ఎలక్ట్రిసిటీ స్తంభానికి చేరబడి నిలబడేవాడు మాణిక్యం.

పదిరోజులాగి "నన్ను బదిలీచేస్తారా! రాజీనామా ఇచ్చేదా? – ఇక్కడ ఈ మనుషులూ, వాతావరణం మధ్య నలిగిపోతున్నాను" అని ఉత్తరం రాశాను సింగుకి.

మరునాడే జవాబు వచ్చింది – "నీకిష్టం లేకపోతే వచ్చేయ్ – మనిషిని పంపుతాను. కాని కొండపల్లి పెద్ద అవకాశం జీవితంలో పాఠం చేర్చుకోవడానికి" అని రాశాడు.

నాకు నవ్వొచ్చింది – నిజమే. పెద్ద పాఠం నేర్వడానికి అవకాశమే.

మర్నాడు మాణిక్యం స్తంభం దగ్గర నిలబడితే లోపలికి పిలిచాను.

వచ్చి "ఏం" అన్నాడు.

"రేపే వెళ్ళిపోతున్నాను"

నమ్మకంలేక విస్తుపోయి చూశాడు –

"అవును, నిజం"

"మంచిది సార్ – మీరు చాలా తెలివైనవారు – అందుకనే నా చెయ్యి కదల్లేదు – ఎప్పుడు వెళ్తారు?"

"రేపు ఉదయం"

నమస్కారం చేసి వెళ్లిపోయాడు.

సాయంకాలం పంకజం కన్పిస్తుందేమోనని ఆ ఇళ్ళవేపు ఒంటరిగా వెళ్ళాను. కనిపించలేదు. ముల్లు గుచ్చుకొన్న రాయిదగ్గర ఓగంట కూర్చొని వచ్చేశాను.

జాన్ కన్పిస్తే "పంకజం కన్పించిందా?" అని అడిగాను.

"లేదు సార్ – వాళ్ళబంధువుల దగ్గరికి – పక్క ఊరు పంపేసిందట వాళ్ళ అమ్మ"

క్షణం విస్తుపోయేను.

"రేపు ఉదయమే వెళ్ళిపోవాలి – నా ట్రంకు, బట్టలు సర్దమను" అని చెప్పాను.

తెలతెలవారకుండానే వాకిట్లోకి వచ్చి కూచున్నాడు మాణిక్యం. నేను నిర్ఘాంతపోయాను "సామాన్లు రైలుకి చేరవేసే పనంతా నాకు వదిలెయ్యండి బాబూ – జీప్ స్టేషన్‌కు చేరేసరికి వీటన్నిటితో అక్కడుంటాను. చెయ్యి సాయంకూడా తెచ్చుకున్నాను" అన్నాడు.

స్టేషన్లో–ఎదురుగ్గా సిమ్మెంటు బెంచీని ఆనుకుని నిలబడ్డాడు మాణిక్యం చేతులుకట్టుకొని. జాన్ ఇంకా వాడిమీద కోపంతో కొరకొరా చూస్తూంటే నవ్వి దగ్గరికి వచ్చి భుజం మీద చెయ్యివేసేడు "నీ మీద నాకేం కోపం లేదురా – నీ కోపం మీద మాత్రం కోపం వచ్చింది"

రైలు కదుల్తూంటే కిటికీ దగ్గరికి వచ్చేడు. "నేనేం చెడ్డవెదవని కానండి"– అన్నాడు.

నేను నిర్ఘాంతపోయాను. మాణిక్యం ఇంకా అలాగే నిలబడి ఉన్నాడు.

వాణ్ని తప్పు అర్థం చేసుకున్నానేమోననిపించింది. వాడి తరహాయే అంతేనేమో. ఏది ఏమయినా మాణిక్యంలో ఈ మార్పు చాలా వింతగానే ఉంది. ఈ వ్యక్తిత్వాన్ని ఎందుకు దాచుకున్నాడా అన్న ఆశ్చర్యం వదల్లేదు. చివర అనిపోయిన ఒక్క వాక్యం తీరని సమస్య అయిపోయింది.

* * * * *

కొన్ని సంఘటనల్ని మనం మరచిపోము. ఆ సంఘటనలే మనల్ని మరచిపోతాయి. అలాగే కొండపల్లి ఖిల్లా విషయమూను.

"నువ్వు ఓడిపోయావ్ – ఆడది నిన్ను జయించి, వెనక్కి తిరిగేసరికి ఇంత నిస్సహాయంగా నిన్ను వదిలేసి పోయింది" అని నవ్వేడు సింగు.

"ఆడది కాదు – కన్నీళ్ళు" అందామనిపించింది. అవన్నీ నా బలహీనతను దాచుకోడానికి నేను చేసే దొంగతనాలని సింగు అనుకొంటాడేమోనని మాట్లాడలేదు.

కన్నీళ్ళతో స్త్రీ చరిత్ర ప్రారంభమయి చిరునవ్వుతో ముగుస్తుంది. మొదటిది ప్రణయం, రెండవది ప్రళయం.

పంకజాన్ని ఎందుకు గుర్తుంచుకోవాలా? అని పదేపదే అనుకున్నాను. కారణాలను ఊహించగల శక్తిని మించి ఆలోచించినకొద్దీ పెరిగిపోతోంది మనస్సులో పంకజం – ఆ కళ్ళను, ఆ నిశ్శబ్దాన్ని, ఆ కన్నీళ్ళను, ఎనలైజ్ చేసి – వ్యక్తిత్వానికి రూపును ఇవ్వగలశక్తి లేదు నాకు.

పంకజం మనస్సును సాల్వ్ చేయడం దేవుడి సమస్యలలో – ప్రేమకు పరిష్కారం ఇవ్వడంలాగు, మంచితనానికి అవధి నిర్ణయించడంలాగు – అతి క్లిష్టమైన తెగని సమస్య ఏమో మరి.

భాషలో రూపంలేని మహాకావ్యం – మాటలకు అందని ఔన్నత్యం – ఓ చిరునవ్వు, కన్నీరు, పిరికితనం ఇదీ పంకజం.

ఆరేళ్ళ తర్వాత మళ్ళీ ఆమె కన్పిస్తుందని ఎలా అనుకుంటాను?

* * * * *

మా శాఖాధికారికి వీడ్కోలు ఇవ్వాలంటే మిగతా ఉద్యోగులందరితోపాటు విజయవాడ స్టేషన్‌కు వచ్చాను. చాలా మంచివాడు. ఉన్నన్నాళ్ళూ ఎవరికీ ఉపకారం చెయ్యని అతని తాటస్థ్యాన్ని మిగతా ఉద్యోగులతో పోల్చుకుని అతను మంచివాడే అని నిర్ధారించారు. ఉద్యోగులంతా ఈ హడావుడి వద్దంటున్నా రైలుస్టేషన్ వరకూ సన్మానాలతో వెన్నాడారు. ఒక్కొక్కప్పుడు మంచితనం కూడా భరించరాని మోతాదులో పెరిగిపోతే సుఖాన్ని చంపేస్తుంది. బిక్కచచ్చి పూలమాలల్ని అందుకొంటూ, స్టేషన్లో అందరి చూపూ తనమీద పడడం భరించలేక గింజుకొంటున్నాడు ఉద్యోగి.

నాకు నవ్వొచ్చింది. ప్లాటుఫారం మీద పచార్లు ప్రారంభించాను.

బుక్‌స్టాల్‌దగ్గర ఆగబోయేసరికి స్తంభందగ్గర కూర్చున్న వ్యక్తుల్ని చూసి నిర్ఘాంత పోయేను. పంకజంలో అంతమార్పు వస్తుందని కలలో కూడా నేను ఊహించలేని విషయం. బొద్దుగా, విశాలంగా పెరిగిన చెట్టులాగు, వంపులన్నీ మరిచిపోయి ఒకే ఆకారంగా – బరువుగా తీరిన శరీరంలో ఎక్కడో పాతపంకజం పోలికలు ఆ కళ్ళల్లో, ఆ పెదాల్లో లీలగా కన్పిస్తు న్నాయి. పాత పంకజానికి పెద్దగుర్తు కళ్ళలో ఇంకా పిరికితనం. కాని మరీ ఆశ్చర్య పరచిన విషయం చుట్టూవున్న పిల్లలు. పక్కనే ఉన్న పెట్టె మీద ఇద్దరు పిల్లలు కూర్చొన్నారు. ఇద్దరికీ నాలుగేళ్ళు దాటి ఉండవు. ఒక కుర్రాడు బలంగా శంఖంలాఉన్న ఆమె మెడచుట్టూ చేతులుచుట్టి మారాం చేస్తున్నాడు. వాడిని ఊరడించడం ఎలాగో తెలీక తికమక పడుతోంది.

నాకంతా వింతగా ఉంది. మనిషిలో అంత పెరుగుదల ఊహించలేని నేను స్తబ్ధుణ్ణయాను. ఒళ్లోకి కుర్రాణ్ణి తీసుకుని ముద్దుపెట్టుకుంటోంది.

ఎప్పుడూ ఆమె గురించి ఆలోచించేందుకు ప్రత్నించకపోయినా ఇన్నాళ్ళ తర్వాత కన్పిస్తే మళ్ళీ ఓసారి ఎదుటికి రావాలనిపించింది. ఇంకా కొన్ని సందేహాలు అలానే ఉండిపోయాయి. చుట్టూ చూసినా ఆమెకు సంబంధించిన వ్యక్తి ఎక్కడా ఉన్నట్టు

తోచలేదు.

నన్ను చూస్తే ఏమనుకుంటుందో - చూసి, అంతలో నవ్వి పలకరించవచ్చు - పెళ్ళి గురించి అడుగుతుందేమో? ఆ కుర్రాళ్ళని చూపించి 'ఏమీ చేతకాని నీకంటె నేను చాలా నయం' అని కళ్ళలో మాట్లాడితే! ఏమైనాగాని - ఓసారి పలకరించాలన్న ఉబలాటం ఎక్కువయింది.

ఎనిమిదేళ్ళ కిందటి ఒక్క సందేహం ఇప్పటికీ వదల్లేదు. అప్పటి పంకజం విముఖతకు కారణం ఆలోచిస్తే అర్థం బోధపడదు. అందుక్కారణం మాణిక్యవా? లేక పంకజంలో పిరికితనవా? - తెలీదు.

లేచి కొడుకుని ఎత్తుకుని గోడనున్న బొమ్మవేపు చూపిస్తోంది. బుక్‌స్టాల్ నీడలోంచి కదిలాను. బొమ్మపక్కకి వచ్చి నిలబడ్డాను. ఈసారి బొమ్మని చూపించబోయి నన్ను చూసి దిమ్మెరపోయింది. క్షణం భయపడిందేమో - కొడుకుని గట్టిగా గుండెకు అదుముకొంది.

నవ్వుదామనుకుంటే పెదాలు వణికాయి. శక్తిలేక కింది పెదవిని నొక్కిపట్టుకున్నాను.

క్షణం ఆగి స్తంభానికి అనుకు నిలబడ్డది. నా వేపునుంచి దృష్టి మళ్ళించలేదు. ఆ కళ్ళల్లో ఇంకా పాతస్ఫూర్తి - అలానే -

ఒక్కసారి హఠాత్తుగా చుట్టూ పరికించింది. నేను దగ్గరికి వస్తే కుర్రాణ్ణి కింద దింపేసి కొంగు సరిచేసుకుంటోంది.

సంజ్ఞ చేస్తూనే పలకరించాను.

ఇంకా నన్ను విచిత్రంగా చూస్తూనే ఉంది. కళ్ళల్లో మళ్ళీ పాత ఆశ, కోరికా. లేకపోతే నేను పొరబడ్డానేమో?

అంతలోనే రెండు చేతులూ గుండెకు ఆనించుకుని తొందరగా ఏదో సంజ్ఞ చేస్తోంది.

నాకు అర్థంకాదు. ఎటువేపో చూసి మళ్ళీ చెప్పింది.

ఈసారి - అవును, అర్థమయింది.

"మీకో నమస్కారం చేస్తాను. నాతో మాట్లాడకండి ఆయన చూస్తే నా ప్రాణం తీస్తారు" ఇదీ నాకు బోధపడిన విషయం. 'ఆయన'ను ఎటువేపో చూపి సూచించింది.

మొదటిసారిగా, చివరిసారిగా పూర్తిగా కుంగిపోయాను. బుక్‌స్టాల్‌లో బుద్ధుడి అట్టనీడ అడ్డంగా ముఖంమీదపడి నా కవలికల్ని కప్పి పుచ్చింది. పిల్లలు ఎదురుగ్గా వెలిగి ఆరే లైట్ల వేపు చూస్తున్నారు. పంకజం నావేపు చూడడం వెయ్యి యుగాల క్రిందటే మానేసింది. కొడుకు చుట్టూ నీలిరంగు కొంగులిప్పి దగ్గరగా హత్తుకుని పెట్టెమీద కూచొంది. పిల్లాడి తలమీదగడ్డం ఆనించింది. మొదట ఏడుస్తుందేమోననుకొన్నాను. దిగులుగా రైలు పట్టాలవేపు చూస్తోంది.

శరీరమంతా చెమట పోస్తోంది. నడవలేనంత నిస్త్రాణగా ఉంది. అంతకుమించి పంకజం వైఖరి. 'స్త్రీలో ఇంతమార్పు సాధ్యమా?' అన్న ఆలోచన మెదడుని కొరుకుతోంది.

పక్కకి అడుగు వేయబోతే స్టామాన్లు మోసుకొచ్చే బండివాడు కేకపెట్టాడు. సిగ్గుపడి పక్కకి తప్పుకున్నాను.

రైలు విపరీతమైన శబ్దం చేసుకొంటూ వచ్చింది. త్వరత్వరగా పిల్లలందర్నీ లేవదీసి ఎవరికోసమో – నన్ను తప్ప – మిగతా అన్ని చోట్లా కళ్లతో వెతుకుతోంది పంకజం. పక్కనే నీడలో ఉన్నానని తెలిసికూడా నన్ను చూడడంలేదు.

మెల్లిగా నడక ప్రారంభించాను.

పదిగజాలు నడిచాక ఎవరో నన్ను పిలుస్తున్నారు. పక్కకి తిరిగితే ఫ్లాస్కు పట్టుకుని అతను – అతనే! – పేరు గుర్తు రావడం లేదు. మాణిక్యం! అదీ అతని పేరు.

నిర్ఘాంతపోయాను. 'మాణిక్యం' అన్నాను నీరసంగా రైలు గొడవమధ్య శబ్దం సగం చచ్చిపోయింది.

"అవును బాబూ ... నేనే! కులాసాగా ఉన్నారా? చాలా చిక్కిపోయారే. భిలాయ్‌లో ఉద్యోగం దొరికింది బాబూ. పోతున్నాను."

చేతిలోని ఫ్లాస్కు బుజానికి తగిలించుకొన్నాడు.

"వస్తాను బాబూ. పెళ్ళాం, పిల్లలు ఇక్కడే ఉన్నారు. అరె! మీకు చెప్పలేదే! – పంకజం ఇక్కడే ఉంది. చూస్తారా? – నాకు ముగ్గురు పిల్లలు."

ముఖం తిరుగుతుందేమోనని భయం వేసింది. నీరసంగా నవ్వాను.

"ఇప్పుడు రాలేను మాణిక్యం. తొందర పనిఉంది. సంతోషం" అని నీడలోకి వత్తిగిలి నడచి వచ్చేశాను.

* * * * *

ఇప్పుడిక పాత కథకి ఓ తోవంటూ కన్పించింది. కాని పంకజం గురించి ఆలోచించిన కొద్దీ విచిత్రమైన సమస్య మాత్రమే మిగులుతోంది.

కోరిక కోసం పరిస్థితుల్ని ఎదిరించడం సాధ్యమని ఊహించలేని పంకజం, సంప్రదాయాలకు లొంగి అధికారానికి పిల్లల్ని కన్నది.

కాని పాత సంప్రదాయాలపై తిరుగుబాటు చేయలేని బలహీనతే మాణిక్యంలాంటి వ్యక్తిని పెళ్ళి చేసుకోవడానికి కారణమయితే ఆరేళ్ళ క్రితం కొండపల్లి అనుభవాలకి, అప్పటి ఆమె చిరునవ్వుకి, ఆ కళ్ళల్లో ఆహ్వానానికి అర్థం లేదు.

ఆలోచించిన కొద్దీ ఈ వింత ప్రవృత్తి ఒక్క పంకజానికే కాక స్త్రీకే సహజమనిపిస్తుంది. అభిరుచికంటే అనుభవంపట్ల ఆకాంక్ష ఎక్కువ స్త్రీకి. పురుషుడికల్లా కాదు. అనుభవంకన్న అభిరుచి ముఖ్యం. అందువల్లనే సంప్రదాయాలను, నైతిక పరిధులను తెంచుకుపోయే శక్తి, తెగింపు పురుషుడికంటె, స్త్రీకి ఎక్కువ.

పురుషుడి ప్రేమకథ, ప్రేమని ప్రేమించడంతో ప్రారంభమయి స్త్రీని ప్రేమించడంతో ముగుస్తుంది. కాని స్త్రీ మొదట పురుషుణ్ని ప్రేమించడంతో ఆరంభించి, ప్రేమని ప్రేమించడంలో

తృప్తి పడుతుంది. అందుకనే ఆమె ఎన్నిసార్లయినా ప్రేమించ గలుగుతుంది. ఎంచాతనంటే ఆమె ప్రేమించేది పురుషుని కాదు కనక, ప్రేమని గనుక. ప్రేమా? ఉఫ్! ఇరవయ్యో శతాబ్దపు మానవుడు అర్థం తెలీని రోగానికి అవ్యాహతంగా పుచ్చుకొనే ఒక చీప్‌టానిక్। అదీ ప్రేమకి నిర్వచనం.

కాస్త ఆలోచిస్తే ప్రేమదీ ఏమీ తప్పులేదనిపిస్తుంది. ప్రేమ జన్మస్థానం కోరిక, కోరిక జన్మస్థానం – స్త్రీ!

ఇంత ఆలోచించికూడా పంకజం జీవితం పట్ల సానుభూతి చూపించ లేకపోతోంది మనస్సు. ఒక్కసారి ఆమె మాట్లాడగలిగితే బావుణ్ను, సంస్కారాన్ని పూరించుకోలేని ఆమె స్త్రీత్వం చేసిన పొరపాటేమో అది అనుకుందామన్నా సరికాదు.

స్త్రీ ఎప్పుడూ పొరపాటు చేయదు. తనతో గడిపినవాళ్ళంతా పొరపాటు చేశారనిపించేట్లు చేస్తుంది.

ఏమైనాగానీ, పంకజం చర్యలకు వేరే అర్థం ఏమీ కన్పించదు–ఆకాశం నీలానికి, కొండ స్థిమితానికి అర్థం లేనట్టు.

---